క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



కంచికచర్ల : గండేపల్లిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టామని సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు.ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ బ్లీచింగ్, సున్నం చల్లించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. కాల్వల్లో మురుగునీరు పారుదల సజావుగా సాగేలా ఎప్పటికప్పుడు పూడిక తీయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై పేరు తొలగింపు



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): గ్రామంలోని యూపీ పాఠశాలకు గ్రామానికి చెందిన మల్లెంపాటి విశ్వనాథం, రామతులసమ్మ స్థలాన్ని దానమిచ్చారు. అందుకు గుర్తుగా వారి మనవడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లెంపాటి జయరాం పాఠశాల గోడకు జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చేత శిలాఫలకం ఆవిష్కరింపజేయించారు. అయితే ఈ శిలాఫలకంపై జయరాం, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అనే పేర్లను గుర్తుతెలియని వ్యక్తులు కటింగ్ మిషన్‌తో తొలగించిన వైనం శుక్రవారం వెలుగుచూసింది. ఇలా శిలాఫలకంపై ఉన్న పేరును తొలగించడం దారుణమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

కౌలు వేలం ద్వారా రూ.3.40లక్షల ఆదాయం

భీమవరం(వత్సవాయి) : వేదాద్రి శ్రీయోగానందలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భీమవరం గ్రామంలో ఉన్న 19.32ఎకరాల భూమి కౌలు వేలాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ వేలంలో హెచ్చుపాటదారుగా కంభంపాటి వెంకటేశ్వర్లు రూ.3.40లక్షలకు కౌలుహక్కులను సొంతం చేసుకున్నట్లు ఆలయ ఈవో శిరపరపు హేమలతాదేవి తెలిపారు. కౌలువేలాన్ని నందిగామ మండలం అంబారుపేట సత్యమ్మతల్లి దేవస్థానం ఈవో పి.సీతారామయ్య పర్యవేక్షించగా, దేవస్థాన వంశ పారంపర్య ధర్మకర్త వీఎల్ ఇందిరాదత్తు ప్రతినిధి పి.రామ్‌ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్ బోల్తా



జగ్గయ్యపేట అర్బన్: పట్టణ శివారులోని పద్మావతినగర్‌లో శుక్రవారం మున్సిపల్ మంచినీటి ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. పద్మావతినగర్‌లోని హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి నీటిని నింపుకుని వస్తున్న మున్సిపల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ వెంకట్ స్వల్పంగా గాయపడ్డాడు.

కాశీలో ఉప్పలూరి గ్రంథావిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరానికి చెందిన శతకశ్రీ ఉప్పలూరి లక్ష్మీనారాయణ రచించిన అయోధ్య సుందర బలరామ వాత్సలి, కాశీ రామతారక ప్రచండ సుందర ఆశ్రయ పద్య శతకం, తాత్పర్య సహిత గ్రంథాన్ని కాశీలో శుక్రవారం బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రామతారక ఆంధ్ర ఆశ్రమం మేనేజింగ్ ట్రస్టీ వేమూరి సుందర శాస్త్రి సభాధ్యక్షతన గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. కాశీ స్వామి నారాయణనంద భారతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. రచయిత లక్ష్మీనారాయణ గ్రంథ విశ్లేషణ చేస్తూ, బాల, అయోధ్య, అరణ్య, కిష్కింద, సుందర, యుద్ధ, ఉత్తర కాండ విశిష్టతను శ్రవణానందంగా వివరించారు. ప్రముఖ పురాణవేత్త చిదంబరశాస్త్రి, పద్య విశిష్టత, గ్రంథ ఔన్నత్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో గుర్రం ఏడుకొండలు, పోలవరపు పేరయ్య శర్మ, ఉప్పలూరి వెంకటేశ్వరరావు, వెంకటప్రసాద్, టీటీ ప్రసాద్, సీహెచ్ హేమలత, డి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..జరభద్రం

- గ్రామాల్లో కానరాని పారిశుద్ధ్యం
- ఎక్కడిచెత్త అక్కడే
- వ్యాధులు ప్రబలుతుండటంతో ఆందోళనలో ప్రజలు



మక్కపేటలో రహదారి వెంబడి ఉన్న చెత్తకుప్పలు

వత్సవాయి : వర్షాకాలం వచ్చేసింది..దాంతో పాటే వ్యాధులను కూడా వెంట తీసుకువస్తోంది. కొద్దిపాటి అవగాహనతో అప్రమత్తంగా ఉంటే అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. ఈ వర్షాకాలంలోనే ఎక్కువ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వర్షపు నీరు నిలిచి మురుగుగుంటలుగా మారి వాటిలో దోమలు వృద్ధి చెందుతాయి. సైడ్ కాల్వలు, నివాస ప్రాంతాల సమీపంలో తాగిపడేసిన కొబ్బరిబొండాలలో దోమల విపరీతంగా ఉండే అవకాశం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చు. చిన్నపాటి జ్వరం వచ్చినా గ్రామాల్లో ఉన్న రక్త, మూత్ర పరీక్షలంటూ డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేయించాల్సిన దుస్థితి తప్పుతుంది. ఈ వర్షాకాలంలో వైద్యశాఖ గ్రామాల్లో అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ అంటూ హడావుడి చేయడం కాకుండా గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

డయేరియా కేసుల నేపథ్యంలో..

ఇప్పటికే వత్సవాయి మండలంలోని వత్సవాయి, మక్కపేట, మంగొల్లు, దేచుపాలెం, పెద్దమోదుగపల్లి, వేములనర్వ తదితర గ్రామాల్లో డయేరియా కేసులు నమోదైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్, వైద్యశాఖ అధికారులు తగుచర్యలు తీసుకుని గ్రామాల్లో అంటువ్యాధులు సోకకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పటిష్ట పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి..

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై సర్పంచులు, అధికారులు దృష్టిసారించాలి. సైడ్ కాలువల్లో మురుగు తొలగించడంతోపాటు వీధుల వెంట బ్లీచింగ్ చల్లించాలి. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలి. గ్రామాల్లో కొబ్బరిబొండాల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు మిగిలిన చెత్తను గ్రామ పరిసరాల్లో పోయకుండా తగలబెట్టేలా చర్యలు తీసుకోవడం ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచవచ్చు. రక్షిత మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు సరఫరా అయ్యే నీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రత పాటించేలా వారికి అవగాహన కల్పించడం ద్వారా వారు వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చు.



వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు(ఫైల్)

కాచి చల్లార్చిన నీటిని తాగాలి..



ఈ వర్షాకాలంలో వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు ప్రజలు కాచి చల్లార్చిన పరిశుభ్రమైన నీటిని తాగాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినకూడదు. వేడి ఆహారపదార్థాలనే తీసుకోవాలి. వర్షాకాలంలో వీలైనంత వరకు మాంసాహారానికి దూరంగా ఉంటే మంచిది. జ్వరం దగ్గు, తలనొప్పి ఒంటినొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలో ఉన్న వైద్యశాలలో సంప్రదించాలి.

–సుష్మాప్రియదర్శిని, మండల వైద్యాధికారిణి, వత్సవాయి

మత్తు పదార్థాలతో తీరని నష్టం



హాజరైన విద్యార్థులు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఏసీపీ డాక్టర్ రవికిరణ్, వేదికపై సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ హైమావతి

ఏసీపీ డాక్టర్ రవికిరణ్

కంచికచర్ల : మత్తుపదార్థాల వినియోగంతో నిండుజీవితాలు బలైపోతాయని, ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నందిగామ ఏసీపీ డాక్టర్ బి. రవికిరణ్ సూచించారు. కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కాలేజీలో 'మాదక ద్రవ్యాలను అరికడదాం' అనే అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఏసీపీ డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ యువత దేశాభివృద్ధికి దోహదపడేలా నడుచుకోవాలన్నారు. దేశరక్షణ కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి పనులకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మత్తుపదార్థాలు, అసభ్యకరమైన సినిమాలకు యువత ఆకర్షితులై మంచి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు ఇప్పటికే పోలీస్‌శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని వివరించారు. మాదక ద్రవ్యాలను అరికట్టి, విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు మంచి పునాది వేసుకుందామని ఏసీపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పి.చంద్రశేఖర్, ఎస్‌ఐ–2 హైమావతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకిరణ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నిమ్మగడ్డ శౌరయ్య, అధ్యాపకుడు జి.రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుపై రైతుల ఆసక్తి



గుమ్మడిదూర్రులో సాగవుతున్న జీలుగులు పంట



అనిగండ్లపాడులో చేపట్టిన పిల్లిపెసర సాగు

పెనుగంచిప్రోలు: పచ్చిరొట్ట సాగుపై రైతులు ఇటీవల కాలంలో ఎంతో ఆసక్తిని చూపిస్తున్నారు. పంటల సాగుకు ముందు రైతులు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే వివిధ రకాల పచ్చిరొట్ట విత్తనాలు వేస్తున్నారు. పంట వేసే ముందు దానిని భూమిలో కలియదున్నుతున్నారు. దీంతో భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తుండటంతో రైతులు అందుకనుగుణంగా పచ్చిరొట్ట సాగు చేపడుతున్నారు. పచ్చిరొట్ట సాగుతో భూములు ఆకుపచ్చగా కళకళలాడుతున్నాయి.

రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సీపీఎం



పేట ప్రభుత్వాస్పత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంతంలో ఇటీవల డయేరియా సోకి మృతిచెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబురావు, సుబ్బారావమ్మ, జిల్లా కార్యదర్శి డీవీ.కృష్ణ డిమాండ్ చేశారు. డయేరియాతో షేర్‌మహ్మద్‌పేటలో ఇటీవల మృతిచెందిన వ్యక్తుల కుటుంబసభ్యులను శుక్రవారం వారు పరామర్శించారు. అనంతరం గ్రామంలో కొనసాగిస్తున్న మెడికల్ క్యాంపును సందర్శించారు. గ్రామంలోని మంచినీటి బావి, పైపులైన్ వాల్వ్‌ను పరిశీలించారు. గ్రామసెక్రటరీతో మాట్లాడి గ్రామంలో డయేరియా, పారిశుద్ధ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగ్గయ్యపేట పట్టణంలోని డాంగేనగర్‌లో ఇటీవల మృతిచెందిన డయేరియా బాధితుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబ పరిస్థితిని ఆరా తీశారు. అదేవిధంగా జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించి వార్డులో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు. ఆస్పత్రిలో డయేరియా కేసులు, చికిత్స, డిశ్చార్జి అయిన బాధితుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కృష్ణాజలాలు అందించాలి...

పేట ప్రభుత్వాస్పత్రి వద్ద సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబురావు, సుబ్బారావమ్మ, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విలేకరులతో మాట్లాడారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు కృష్ణా జలాలను సరఫరా చేయాలని కోరారు. కొంతకాలంగా జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో 17 గ్రామాల్లో, పేట పట్టణంలో 16 వార్డుల్లో సుమారు 300 మందికి డయేరియా సోకిందని, వారిలో 150 మంది ఆస్పత్రుల్లో చికిత్సపొందగా, మిగిలిన వారు ఇళ్లవద్దనే చికిత్స పొందారని తమకు సమాచారం ఉన్నట్లు చెప్పారు. డయేరియాతో ఆరుగురు మృతిచెందారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేసి వారిని ఆదుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌సీహెచ్.శ్రీనివాస్, ఆపార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, పేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి, పట్టణ శాఖ కార్యదర్శి దాసరి నాగేశ్వరరావు, నాయకులు కోట కృష్ణ, లింగారావు, గౌస్‌మియా, కోట రవికుమార్, రావెళ్ల శేషు, రామనాథం, రామకృష్ణ పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

జుజ్జూరు(వీరులపాడు): ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంఈవో వెంకటరత్నం హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న దుల్జాభవానీ అమ్మవారి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన ఆరాధ్య దైవమైన అమ్మవారికి పంచామృతాభిషేకాలు, హోమాలు, విశేషాలంకరణతోపాటు ప్రత్యేక హోమాలు చేశారు. అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు కుబియా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయి అక్రమ రవాణా కేసులో తప్పించుకుని తిరుగుతున్న యువకుడిని కొత్తపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గతేడాది కేఎల్ రావు నగర్ రైల్వే క్వార్టర్స్ వద్ద కొంత మంది యువకులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులలో ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఆ కేసులో మరో నిందితుడైన కేఎల్ రావు నగర్‌కు చెందిన మాసా భక్తుల వెంకట లక్ష్మీ నారాయణ(20) అలియాస్ పండు, అలియాస్ దాబాను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు ఆదేశాలతో విజయవాడ సబ్ జైల్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

డయేరియా వ్యాప్తిపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో సుహాసిని



షేర్‌మహ్మద్‌పేటలో నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): యేరియా వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సుహాసిని సూచించారు. షేర్‌మహ్మద్‌పేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతంలో వారం రోజులుగా వ్యాప్తి చెందిన డయేరియా అదుపులోకి వచ్చిందన్నారు. తాగునీటి కాలుష్యం, పారిశుద్ధ్యలోపంతోనే డయేరియా ప్రబలిందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటి సర్వేతోపాటు ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారని వివరించారు. ఈ క్రమంలో గంద్రాయి రోడ్డులోని అపరిశుభ్రంగా ఉన్న డ్రైన్‌లను పరిశీలించి పూడిక తీయించారు. ఎస్సీ కాలనీలో నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి వైద్యసిబ్బందితో తొలగించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మోతిబాబు, వైద్యాధికారులు అనిల్‌కుమార్, స్రవంతి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార విశ్లేషణ రంగంలో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న డాక్టర్ నాగేంద్రకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వ్యాపార విశ్లేషణ రంగంలో విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజ్ఞాన్స్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్ ఆచార్యులు డాక్టర్ తురగా నాగేంద్రకుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజిమెంట్ విభాగం ఆధ్వర్యంలో 'ది ఫ్యూచర్ ఆఫ్ బిజినెస్ అనలిటిక్స్ – ట్రెండ్స్ అండ్ ఎమెర్జింగ్ టెక్నాలజీస్' అంశంపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. వ్యాపార విశ్లేషణ అనేది నేడు విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న రంగమన్నారు. వ్యాపార అభివృద్ధి, విస్తరణ, భవిష్యత్ ప్రణాళిక ఇలా అనేక అంశాలపై విశ్లేషణ చేసి చక్కని సమాచారాన్ని అందించటమే దీని లక్ష్యమని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వ్యాపార వృద్ధికి అవసరమైన నూతన నిర్ణయాలకు వ్యాపార విశ్లేషణ చాలా ఉపకరిస్తోందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాల్లో నూతనంగా వస్తున్న ఆవిష్కరణలను తెలుసుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులు తమ అభివృద్ధికి అవసరమైన ఆలోచనలు చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి హేమంత్‌కుమార్ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమ రక్షణకు చర్యలు తీసుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చేనేత పరిశ్రమను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని, చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయడంతో పాటు నేతన్న నేస్తం మగ్గం నేస్తున్న ప్రతిచేనేత కార్మికుడికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేసి, పనిచేస్తున్న సహకార సంఘాలను ప్రోత్సహించాలని కోరారు. నాయకులు కట్టా శివదుర్గారావు, ఎం.భాస్కరయ్య పాల్గొన్నారు.

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం కలసి పాడుదాం 17 పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. సీనియర్ గాయకుడు బాలజీకుమార్ ఆధ్వర్యంలో స్వాతి మీరాకుమార్, అయ్యప్పన్, సీతా దేవి,పద్మ, పవన్‌కుమార్, సయ్యద్ ఆలీ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

సవరణ

[illegible]

ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పార్కు నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘం పరిధిలో గృహాల మధ్యనున్న ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు సూచించారు. పట్టణంలోని ఆయా కాలనీలను కమిషనర్ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పట్టణ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఖాళీ స్థలాలలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోవడంతోపాటు ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు తమ గృహాలలోని వ్యర్థాలను కూడా పడేస్తుండటంతో ఆయాస్థలాలు దోమాలకు ఆవాసాలుగా మారాయన్నారు. దీంతో వైరల్ ఫీవర్లు, డయేరియా, డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ఖాళీ స్థలాల యజమానులు విధిగా తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

రెండు డయేరియా కేసులు..

ప్రస్తుతం జగ్గయ్యపేట పట్టణంతోపాటు పేట మండలంలో డయేరియా కేసులు వస్తున్న దృష్ట్యా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు సూచించారు. పట్టణంలోని డాంగేనగర్, చెరువుబజారులో వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వాస్పత్రిలో చేరినందున ఆయా ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఉన్న, చెడిపోయిన ఆహార పదార్థాలను తినరాదని సూచించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై శ్రీస్వేచ్ఛ నృత్య తరంగిణి కళాబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై కళా బృందానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ఆలయ అధికారులు కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉపాధ్యాయులందరూ కలిసి సంఘటిత శక్తిగా ఏర్పడి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత శక్తిని పెంపొందించాలని సీబీఎస్‌ఈ బోర్డు రీజనల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర సూచించారు. సీబీఎస్‌ఈ ఆధ్వర్యంలో బాలవాటిక, జాదూయీ పిటారా కార్యక్రమాలపై అవగాహన సదస్సు పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో శుక్రవారం జరిగింది. శేఖర్ చంద్ర హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా పాఠశాలల్లోని ప్రీ కేజీ, నర్సరీ పేర్లను తొలగించి బాలవాటిక-1, బాలవాటిక-2 పేర్లతో పిలవాలని ఆదేశించారన్నారు. పిల్లల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించడానికి ఉపాధ్యాయులు పుస్తకాల్లోని పాఠ్యాంశాలను బోధించడంతో పాటుగా డిజిటల్ రూపంలో పాఠాలు చెప్పడం, కొండపల్లి బొమ్మలు, తోలు బొమ్మల ద్వారా విద్యార్థులకు పాఠాలు చెప్పడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.

డ్రాయింగ్‌పై ఆసక్తి కనబరిచేలా..

సీబీఎస్‌ఈ సీఈవో అరుణా వెంకటేశన్ మాట్లాడుతూ కొండపల్లి బొమ్మలు, తోలు బొమ్మలు ఇలా బొమ్మల రూపంలో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఉపయోగించే పెట్టెను జాదూయీ పిటారా అంటారని తెలిపారు. విద్యార్థులను డ్రాయింగ్‌పై ఆసక్తి కనబరిచేలా చూడాలన్నారు. రిసోర్స్ పర్సన్లు సుధారాణి, భారతి, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య పాల్గొన్నారు.